



బంతిపూల సోయగం



కోహీర్ మండలం కవెల్లి శివారులో 65వ జాతీయ రహదారి పక్కన ఓ రైతు తన ఐదెకరాల్లో బంతిపూల తోటను సాగు చేస్తున్నారు. నేలపై పసుపు రంగు పరిచినట్టున్న బంతిపూలు హైవేపై వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి.

-కోహీర్, (ఆంధ్రజ్యోతి)

రామచంద్రాపురంలో శ్రీలీల సందడి



సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఓ షాపింగ్ మాల్‌ను ప్రముఖ నటి శ్రీలీల శుక్రవారం ప్రారంభించారు. ఆమెను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

-రామచంద్రాపురం

ఎన్‌కౌంటర్ ఎక్కడైనా..

ఉలికిపాటు ఇక్కడే!

వరుస ఘటనలతో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆందోళన

- మావోయిస్టు పార్టీలోని పలు హోదాల్లో ఐదుగురు జిల్లావాసులు
- కాలక్రమేణా మసకబారుతున్న విప్లవోద్యమం
- ఇరవైఏళ్ల పాటు పీపుల్స్‌వార్, జనశక్తి గ్రూపుల హవా
- హుస్నాబాద్‌లో సీఐ,ఎస్‌ఐలను మట్టుబెట్టిన నక్సల్స్
- పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై దాడిలో ఐదుగురు కానిస్టేబుళ్ల మరణం
- దేశంలోనే గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ మొదటిది..
- ఆనవాళ్లు కోల్పోయిన హుస్నాబాద్ అమరుల స్తూపం

'1975 సంవత్సరంలో సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని గిరాయిపల్లి గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సల్స్ మరణించారు. దేశంలోనే దీనిని మొదటి ఎన్‌కౌంటర్‌గా చెప్పుకుంటారు. అనంతరం ఇదే గిరాయిపల్లి పేరిట దళం ఏర్పాటై ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారు 20 ఏళ్ల పాటు ప్రజల పక్షాన పోరాటాలు చేశారు. గిరాయిపల్లితోపాటు ఇందుప్రియాల్, నర్సాపూర్, దుబ్బాక దళాలు సాగించిన పోరుబాటలో వందలాది మంది పాల్గొనగా పదుల సంఖ్యలో నేలకొరిగారు.'

'మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999లో పీపుల్స్‌వార్ గ్రూపు బాంబులతో దాడిచేసింది. ఈ ఘటనలో ఓ హెడ్‌కానిస్టేబుల్ సహా నలుగురు కానిస్టేబుళ్లు అసువులుబాసారు. ఈ సంఘటన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించింది. అదే మండలంలో అప్పటి మంత్రి కరణం రాంచందర్‌రావు ఇంటిని పేల్చివేసిన ఘటన సైతం సంచలనమే. అప్పటి కాంగ్రెస్, టీడీపీ నేతలతోపాటు పోలీసులపై నక్సల్స్ దాడులు చేయడం నిత్యకృత్యమే.'



గ్రీన్‌టైగర్స్ దాడిలో నేలకూలిన హుస్నాబాద్‌లోని అమరుల స్తూపం (ఫైల్)

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబరు 6: ఉమ్మడి మెదక్ జిల్లాలో నక్సలైట్ల (ప్రస్తుతం మావోయిస్టు పార్టీ) విప్లవోద్యమానికి పై రెండు ఘటనలు మచ్చుతునకలు. 1975 నుంచి 2004 వరకు జిల్లాలో పోలీసుల బూట్ల చప్పుళ్లు. తుపాకుల మోతలు ఇక్కడి పల్లెలను అనేకవిధాలుగా ప్రభావితం చేశాయి. ఉద్యమ బాటలో వందలాది మంది యువత అజ్ఞాతశక్తులుగా మారారు. పదుల సంఖ్యలో నేలకొరిగారు. నాడు పీపుల్స్‌వార్‌లో చురుకుగా ఉన్న సభ్యులు నేడు ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా, వ్యాపారులుగా రాణిస్తుండగా.. ఇంకొందరు సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు.

హోరెత్తిన విప్లవపోరు..

ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, నంగునూరు, చిన్నకోడూరు, గజ్వేల్, కొండపాక, తొగుట, దౌల్తాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి, చేగుంట, నిజాంపేట, రామాయంపేట, మెదక్, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, పాపన్నపేట, కొల్చారం, నర్సాపూర్, కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్, మద్దూరు మండలాల్లో దాదాపు 25ఏళ్ల పాటు పీపుల్స్‌వార్, జనశక్తి గ్రూపుల హవా కొనసాగింది. కొన్ని సందర్భాల్లో సమాంతర ప్రభుత్వాలను పల్లెల్లో నడిపించిన పరిస్థితులు నెలకొన్నాయి. నాటి పీపుల్స్‌వార్, ప్రస్తుత మావోయిస్టు పార్టీలో కీలకనేతలైన శాఖమూరి అప్పారావు, సోలిపేట కొండాల్‌రెడ్డి, దుబాషి శంకర్, రావుల శ్రీనివాస్‌ల ప్రస్థానం మెదక్ జిల్లా నుంచే ప్రారంభమైంది. జనశక్తి గ్రూపులోనూ డేగల సుభాష్, రియాజ్, సంగన్న, భీమన్న దళాలు హల్‌చల్ చేసిన సంఘటనలపై ఇప్పటికీ పల్లెల్లో చర్చించుకుంటారు. గిరాయిపల్లి, మేదినీపూర్, ఏడుపాయల, రామాయంపేట, ఇందూప్రియాల్, సీతారాంపల్లి ఎన్‌కౌంటర్లలో పెద్దసంఖ్యలో నక్సలైట్లు నేలకొరిగారు. ఒక్క ఏడుపాయలలోనే నాలుగుసార్లు ఎన్‌కౌంటర్లు జరగడం గమనార్హం.

కాలగర్భంలో హుస్నాబాద్ స్తూపం..

అడవిబాట పట్టి అమరులైన 88 మంది పేర్లతో హుస్నాబాద్‌లోనే భారీ స్తూపాన్ని 1989లో నిర్మించి.. 1990లో ప్రారంభించారు. ఆ తర్వాత పోలీసులు, ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా జరిగిన పలు ఘటనలతో దీనిని కూల్చివేతకు యత్నించారు. 2000వ సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతరావు ఇంటిని కూల్చివేయగా.. గ్రీన్‌టైగర్స్ ఈ స్తూపాన్ని నేలమట్టం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద అమరుల స్తూపంగా పదేళ్లపాటు సందర్శనీయ స్థలంగా పేరొందింది. ప్రస్తుతం ఆనవాళ్లు మాత్రమే ఉన్నాయి. కాగా 1991లో హుస్నాబాద్ ప్రాంతంలోని రామవరం మందుపాతర ఘటనలో సీఐ యాదగిరి, ఎస్ఐ జాన్‌విల్సన్, కానిస్టేబుళ్ల మరణించడం సంచలనం సృష్టించింది.



పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై దాడిలో మృతిచెందిన పోలీసులు (ఫైల్)

ఐదుగురే మిగిలారు..

ఇటీవల ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నారు. గడిచిన నెలరోజుల్లోనే భారీ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోగా తెలంగాణకు చెందిన పలువురు మావోయిస్టులు మరణించారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లా నుండి పలు హోదాల్లో కొనసాగుతున్న ఐదుగురు మావోయిస్టుల కుటుంబాలు, ఆయా గ్రామాల ప్రజలతోపాటు విప్లవోద్యమానికి సంఘీభావంగా ఉన్నవారంతా ఉలికిపాటుకు గురవుతున్నారు.

- కోహెడ మండలం తీగలకుంటపల్లికి చెందిన

మిగతా 7వ పేజీలో..

ఏసీబీ వలలో

పంచాయతీ కార్యదర్శి

- దుకాణం ఏర్పాటుకు ఎన్‌వోసీ కోసం లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

కల్హేర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లోన్ కోసం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి లంచం తీసుకుంటుండగా సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మహదేవ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సి.ఉమేష్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మహదేవ్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాసాన్‌పల్లి చౌరస్తాలో చేపల దుకాణం ఏర్పాటు కోసం బ్యాంకు లోన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. లోన్ మంజూరు కోసం దుకాణం స్థలానికి సంబంధించి ఎన్వోసీ కావాలని బ్యాంకు అధికారులు అడగడంతో సదరు వ్యక్తి గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాడు. ఎన్వోసీ సర్టిఫికెట్ కోసం రూ. 30వేలు ఇవ్వాలని కార్యదర్శి సి.ఉమేష్ డిమాండ్ చేశారు. అడ్వాన్సుగా రూ. 15వేలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనమేరకు వారు ఇచ్చిన కరెన్సీని శుక్రవారం కల్హేర్ ఎంపీపీ కార్యాలయం వద్ద కార్యదర్శికి ఇచ్చాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు వలపన్ని ఉమేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎంపీపీ కార్యాలయ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. నిందితుడిని హైదరాబాద్‌లోని ప్రత్యేక కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచాలు అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ సూచించారు. కాగా, నిందితుడైన కార్యదర్శి ప్రతీ పనికి డబ్బులు తీసకుంటారని ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్టు తెలుస్తున్నది.



ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి సి.ఉమేష్

ఎన్‌సీడీ క్లినిక్ బలోపేతం

అందుబాటులోకి రానున్న ఫిజీషియన్, గైనకాలజిస్టు సేవలు

ఆధునికీకరణ, వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్-అసంక్రమిత వ్యాధుల నియంత్రణ) క్లినిక్ బలోపేతానికి వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ బోధనాస్పత్రిలోని ఎన్‌సీడీ క్లినిక్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇదివరకు జీవనశైలి వ్యాధులతో వచ్చేవారికి బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చి మందులిచ్చి పంపించేవారు. ఇకపై ఎన్‌సీడీ క్లినిక్‌లలో జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్ అందుబాటులో ఉండనున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో వచ్చేవారిని పరీక్షించి అవసరమైన చికిత్స అందజేస్తారు. మెరుగైన చికిత్స అవసరమైతే ఎంఎన్‌జే, నిమ్స్ తదితర పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. జిల్లాలో ప్రస్తుతం 71,703 మంది బీపీతో, 34,673 మంది షుగర్‌తో, 321 మంది వివిధ రకాల క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. ఎన్‌సీడీ క్లినిక్‌తో వీరికి మరింత ప్రయోజనం కలగనుంది. జీజీహెచ్‌లోని ఎన్‌సీడీ క్లినిక్ ఆధునికీకరణ పనులు చకచకా సాగుతున్నాయి. త్వరలోనే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఆధునికీకరించిన ఎన్‌సీడీ క్లినిక్

సీఎం కప్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి మూడంచెల్లో పోటీలు
- సంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి ఖాసీంబేగ్



ఖాసీంబేగ్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్-2024 క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా 14 రోజుల పాటు జరిగే క్రీడలకు జిల్లా యువజన, క్రీడల అభివృద్ధిశాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. సీఎం కప్ నిర్వహణపై జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఖాసీంబేగ్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

సీఎం కప్ షెడ్యూల్ ఏమిటి?

సీఎం కప్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా మూడంచెల్లో పోటీలు జరుగుతాయి. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ స్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో పోటీలు జరుగుతాయి.

ఏయే క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు?

గ్రామస్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఈత, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, యోగా, చదరంగం, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్, జూడో, స్నూకర్ తదితర 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహణకు ఏర్పాటు చేశాం.

సీఎం కప్ క్రీడలకు ఏవిధమైన ఏర్పాట్లు చేశారు?

సీఎం కప్ క్రీడల్లో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ పర్యవేక్షణలో సీఎం కప్ క్రీడలకు ప్రణాళిక రూపొందించాం. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో క్రీడల నిర్వహణ సజావుగా జరిగేలా పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేశాం. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం కప్ పేరిట క్రీడలు నిర్వహిస్తోంది. గ్రామస్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు మండల స్థాయిలో పాల్గొంటారు. జిల్లా స్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. ఈ పోటీలు హైదరాబాద్‌లో ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరుగుగుతాయి. క్రీడల్లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందజేస్తాం. రాష్ట్రస్థాయిలో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి నగదు బహుమతులు అందజేస్తాం.

రైలుబండి.. ఎక్కలేమండి!

- రూ.కోట్ల వ్యయంతో రైల్వేలైన్..
- వచ్చేది ఒకటే రైలు.. అదీ జనానికి అనుకూలంగా లేని టైంలో..
- ఎక్కేవారు పదుల సంఖ్యలో
- మెదక్ రైల్వేస్టేషన్ తీరిది
- సమయానుకూలంగా రైళ్ల సంఖ్యను పెంచాలని కోరుతున్న ప్రయాణికులు



7లో

ఇలా తొలగించారు.. అలా పెట్టారు!

సంగారెడ్డిలో మళ్లీ వెలసిన ఫ్లెక్సీలు

పట్టణంలో మరోసారి కూలిన ఫ్లెక్సీ

రోడ్డుపై వెళ్తున్న ఇద్దరికి గాయాలు

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మరోసారి ఫ్లెక్సీ కూలిపోయి జనాలపై పడింది. పట్టణంలో ఫ్లెక్సీలపై 'ఫ్లెక్సీ వార్.. జనం బేజార్' అనే శీర్షికన గత నెల 29న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ క్రాంతి మున్సిపల్ కమిషనర్ సురేష్ పవార్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది హుటావుడిగా పట్టణంలో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. కానీ, మళ్లీ రోడ్లకు ఇరువైపులా ఫ్లెక్సీలు మళ్లీ దర్శనమిస్తున్నాయి.

మళ్లీ ప్రమాదం

సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి పాతబస్టాండ్ వరకు ఓ రాజకీయ నాయకుడి జన్మదినం సందర్భంగా పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా జీన్స్‌కార్నర్ వద్ద ఉన్న ఓ ఫ్లెక్సీ కూలిపోయి శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న వ్యక్తులపై పడడంతో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. రహదారికి ఇరువైపులా ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు పెట్టడంతో రోడ్డుపై వెళ్లేవారిపై పడిపోతున్నాయని పట్టణవాసులు మండిపడుతున్నారు.



పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద రోడ్డుపై వెళ్తున్నవారిపై పడిపోతున్న ఫ్లెక్సీ

చతుర్విధ జల ప్రక్రియకు

నిదర్శనమే గొటిగార్‌పల్లి

- రాజ్యసభలో గ్రామం పేరును ప్రస్తావించిన సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్



7లో

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


ప్రతాపరెడ్డి మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పబ్బతి ప్రతాపరెడ్డి(60) తన వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ పోవడంతో దాన్ని బంద్ చేసి మరమ్మతులు చేశాడు. అనంతరం ఆన్ ఆఫ్ రాడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేస్తుండగా ఆ రాడ్ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

కారు బోల్తా.. బాలుడి మృతి

నంగునూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి బోల్తాపడడంతో బాలుడు మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజగోపాల్ పేట ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌కు చెందిన శివరాత్రి రంజిత్, శివరాత్రి శివచరణ్(10) హుస్నాబాద్ నుంచి సిద్దిపేటకు కారులో వెళ్తున్నారు. బద్దిపడగ శివారులోకి రాగానే మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో బోల్తా పడింది. దీంతో శివచరణ్, రంజిత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా, శివచరణ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు



ప్రమాదానికి గురైన కారు

జొన్నరొట్టెకు జై!

● రుచికి రుచి.. ఆరోగ్యానికి మంచిది..
● ఎంతోమందికి బతుకుదెరువు చూపుతున్న జొన్న రొట్టెల తయారీ

రానురాను జొన్న రొట్టెలను ఆరగించేవారి సంఖ్య పెరుగుతున్నది. ఎంతో రుచిగా, పోషక విలువలు మెండుగా ఉండడంతో ప్రజలు లొట్టలేసుకుంటూ తింటున్నారు. జొన్న రొట్టెలకు డిమాండ్ పెరగడంతో పలువురు వీటిని తయారు చేసి విక్రయించి ఉపాధి పొందుతున్నారు. రోజుకు 100 నుంచి 150 వరకు రొట్టెలు అమ్ముతూ మంచి ఆదాయం పొందుతున్నారు.

ఇష్టంగా ఆరగింపు... ఖేడ్ నుంచి వచ్చి తయారీ

మెదక్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జొన్నలు జిల్లాలో విరివిగా దొరికే దివ్య ఔషధమనే చెప్పాలి. ఎటు చూసినా బర్గర్, పిజ్జా, బేకరీ, హోటల్ జంక్ ఆహారంతో ఎందరో రోగాల బారిన పడుతున్నారు. వీటికి దూరంగా ఉంటూ, డయాబెటిక్, అధిక రక్త పోటు, కొలెస్ట్రాల్ తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో పల్లెటూళ్లలో విరివిగా వాడే జొన్న రొట్టెలను తినడానికి నేడు జనం ఆసక్తి చూపుతున్నారు. రొట్టెలను తయారు చేయడం అందరికి సాధ్యం కాకపోవడంతో కొనుగోలు చేసి తిని మరి ఆస్వాదిస్తున్నారు. దీంతో జొన్న రొట్టె తయారీ దారులకు మంచి జీవనోపాధి దొరుకుతుంది.



నారాయణఖేడ్ తయారీదారులు ప్రత్యేకం...

నారాయణఖేడ్ ప్రాంతం వారికి రొట్టెల తయారీ వెన్నతో పెట్టిన విద్య. అక్కడ ప్రతీ రోజు ఇంట్లో రొట్టెలు చేసుకుని తింటుంటారు. ఇక్కడి మహిళలు చిన్నప్పుడు ఇంట్లోని కుటుంబ సభ్యుల కోసం నేర్చుకున్న విద్యే ఇప్పుడు జీవనోపాధిగా మారడం ఆనందంగా ఉందని వారు అంటున్నారు. నారాయణఖేడ్ నుంచి వచ్చి మెదక్‌లోని పలు ప్రాంతాల్లో జొన్నరొట్టెలు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఎంతోమంది ఆ ప్రాంతం నుంచి వలస వచ్చి ఇక్కడ జీవనోపాధి పొందుతున్నారు.

జొన్నరొట్టెతో ప్రయోజనాలెన్నో...

జొన్నల్లో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. చపాతీ మాత్రమే తినేవాళ్లు ఇప్పుడు జొన్న రొట్టెలను తినేందుకు ఇష్టపడుతున్నారు. జొన్నలు చాలా బలవర్ధకమైన ఆహారం.. రొట్టెలు చేసుకుని తినడం వల్ల ఎముకలు బలంగా మారుతాయి. జొన్న పిండితో చేసిన ఇతర వంటకాలు సులభంగా అరుగుతాయి. దాని వల్ల బరువు పెరగకుండా ఉంటారని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జొన్నల్లో ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండటం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

జొన్న రొట్టెతో గుండెకు మేలు

నిజానికి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తక్కువగా, మంచి కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నప్పుడే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలా కాకుండా అవసరానికి మించి చెడు కొలెస్ట్రాల్ పెరిగితే గుండె జబ్బులు పుట్టుకొస్తాయి. అయితే జొన్న రొట్టెలను తీసుకోవడం వల్ల వాటిలో ఉండే ఫైబర్ అదనంగా పెరిగిన బ్యాడ్ కొలెస్ట్రాల్‌ను కరిగించేస్తుంది. అదే సమయంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దాంతో గుండెపోటుతో పాటు ఇతర గుండె సంబంధిత జబ్బులు రాకుండా ఉంటాయి. ఇక ఈ జొన్న రొట్టెలను రోజుకు రెండు చొప్పున ప్రతీ రోజు తీసుకున్నా.. ఎలాంటి సమస్య ఉండదు. ఇవి తొందరగా జీర్ణం అవ్వడంతో పాటు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. అంతేకాకుండా అధిక బరువును అదుపులోకి తెస్తాయి.

కట్టెల పొయిపై చేస్తే.. ఆ రుచి వేరు..

ఆనాదిగా కట్టెల పొయ్యిలపై రొట్టెలు చేస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో గ్యాస్ పోయి, బట్టిల పై రొటీలు తయారు చేస్తున్నారు. కానీ కట్టెల పొయ్యిపై చేసిన రొట్టెల రుచి బాగుంటుందని కొనుగోలుదారులు అంటున్నారు.



ఉపాధి దొరుకుతుంది..

జొన్నరొట్టెలు సర్వ సాధారణంగా మా ప్రాంతంలో రోజు తింటుంటాం. అయితే ఇక్కడకు వచ్చాక రొట్టెలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా జొన్న రొట్టెలు తయారు చేసి అమ్మడంతో మంచి ఉపాధి దొరికింది. మా ఆవిడ తయారు చేస్తే నేను తోడుగా ఉంటూ రోజుకు 100 నుండి 150 రొట్టెల వరకు అమ్ముతాం. దీంతో మాకు మంచి లాభంతో పాటు ఎలాంటి ఆర్థిక ఇబ్బంది లేకుండా కుటుంబం గడుస్తుంది. ఇది ఆరోగ్యానికి సైతం ఎంతో మంచిది.

- మొగులయ్య , రొట్టెల విక్రయదారుడు

రేపు నల్లవాగు ప్రాజెక్టు నీరు విడుదల

కల్హేర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సాగునీటిని యాసంగి పంటల కోసం విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ డీఈఈ పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి నీటిని విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఇటీవల సంగారెడ్డిలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇరిగేషన్ డెవలప్‌మెంట్ బోర్డు సమావేశంలో నల్లవాగు ప్రాజెక్టు కింద 4089 ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు విడుదల చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కుడి కాలువ ద్వారా 2989 ఎకరాలు, ఎడమ కాలువ కింద 1100 ఎకరాలకు ఆరుతడి పంటలకు, అత్యవసర కాలువ కింద 60 ఎకరాల్లో వరి పంట కోసం నీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు

బాల్య వివాహం నిలిపివేత

ఝరాసంగం, (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 6 : మండల పరిధిలోని చీల్కేపల్లి గ్రామంలో శుక్రవారం బాల్య వివాహాన్ని డిప్యూటీ తహసీల్దార్ యాసిన్, ఐసీడీఎస్ అధికారిని అనిత కుమారి అడ్డుకున్నారు. కోహీర్ గ్రామానికి చెందిన బాలిక(17)ను ఝరాసంగం మండలంలోని చీల్కేపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడితో వివాహం చేసేందుకు ఇరు వర్గాల కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. డీజీ కంట్రోల్ రూం నుంచి సమాచారం అందడంతో పోలీస్ అధికారులు అప్రమత్తమై రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో వారు వెంటనే అక్కడికి వెళ్లి బాల్య వివాహాన్ని నిలిపివేశారు. ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను సంగారెడ్డి సఖీ కేంద్రానికి తరలించారు.


ఆటోలో తరలిస్తున్న బియ్యం బస్తాలు

ప్రభుత్వ హాస్టల్ బియ్యం విక్రయం..!

చిన్నకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామ శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌కు పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ అవుతున్న బియ్యాన్ని విక్రయించడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం బియ్యాన్ని ఆటోలో తరలించి సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ వ్యాపారికి విక్రయించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బియ్యం పాడై పోయాయనే నెపంతో 4 క్వింటాళ్ల 65 కిలోల బియ్యాన్ని ఆటోలో తరలించి వ్యాపారికి అమ్ముతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన రిసిప్ట్ ఉండటం గమనార్హం.


RECEIPT

Date:06-12-2024

This is to certify that Hostel committee received wastage rice 465 kg sold to A.Yadagiri ,Auto No. AP 36 X 5361 from Government Polytechnic for Women, Siddipet Hostel.

Principal

కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో కూడిన రిసిప్ట్

టోల్ ప్లాజా వద్ద ఘర్షణ

● రుసుం చెల్లించే విషయంలో వివాదం
● వాహనదారుడికి గాయాలు..
● యువకుల దాడిలో టోల్ ప్లాజా అద్దాలు ధ్వంసం


తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద గుమిగూడిన యువకులు

పుల్‌కల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి- నాందేడ్, అకోలా జాతీయ రహదారి 161పై మండలంలోని తాడానిపల్లి వద్ద ఉన్న టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వాహనదారుడికి.. టోల్ ప్లాజా సిబ్బందికి మధ్య తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటకు చెందిన కట్కం వినయ్ స్నేహితులతో కలిసి కారులో సంగారెడ్డిలో జరిగే వివాహ వేడుకలకు వెళ్తున్నాడు. కారు టోల్‌ప్లాజా వద్దకు రాగా, అక్కడి సిబ్బంది రుసుం చెల్లించమని అడిగారు. అయితే, తన వాహనం ఇంకా రిజిస్ట్రేషన్ కూడా కానందున ఫాస్ట్ ట్యాగ్ వేయలేకపోయానని, అయినా.. తాను లోకల్ కిందకు వస్తానని, టోల్ మినహాయింపు ఇవ్వాలని అడిగారు. అక్కడి సిబ్బంది టోల్ ఫీజు చెల్లిస్తేనే వాహనం వదులుతామని చెప్పారు. ఆగ్రహంతో కారు దిగిన వినయ్ టోల్ సిబ్బందిపై చేయి చేసుకున్నాడు. దీంతో అక్కడి సిబ్బంది వినయ్‌పై రాడ్‌తో దాడి చేయగా, తలకు బలమైన గాయాలు అయ్యాయి. సంగారెడ్డికి వివాహ వేడుకలకు వాహనాల్లో వెళ్తున్న జోగిపేట యువకులంతా ఒక్కసారిగా టోల్‌ప్లాజా వద్దకు వచ్చి.. కార్యాలయంపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. ఈ సంఘటనలో ఇరువర్గాలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ వచ్చి.. ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు. సుమారు గంట పాటు ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

వినూత్న రీతిలో బోధన


దిగ్వాల్ గ్రామంలోని చెరువు కట్ట వద్ద విద్యార్థులు

కోహీర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరవ తరగతి విద్యార్థులకు ఆ పాఠశాలలో తెలుగు పండిట్ పనిచేస్తున్న డాక్టర్ వసంత్‌రాజ్ వినూత్న రీతిలో పాఠాలను బోధిస్తున్నాడు. చెరువుల ప్రాముఖ్యతను వివరించేందుకు గ్రామంలోని చెరువు వద్దకు విద్యార్థులను తీసుకువెళ్లి పాఠాన్ని బోధించాడు. చెరువులపై ఆధారపడి జీవించే కులవృత్తులు, వినాయక చవితి, బతుకమ్మ పండగలకు సాంస్కృతిక వారధిగా ఉండడం వంటి విషయాలను వివరించారు. వినూత్నంగా పాఠాలు బోధిస్తున్న వసంత్‌రాజ్‌ను ప్రధానోపాధ్యాయుడు జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆనంద్, చంద్రశేఖర్, భార్గవి అభినందించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కొండపాక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండపాక మండలం సిరిసనగండ్ల గ్రామానికి చెందిన భూమయ్య, యాదవ్వ కుమారుడు భాను (22) మూడు నెలల నుంచి ఏ పని చేయకుండా తిరుగుతూ డబ్బుల కోసం తల్లిదండ్రులు ఇబ్బంది పెడుతున్నాడు. అంతేకాకుండా భాను చెల్లెలిని మేనవారికి ఇచ్చి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు నిర్ణయించడంతో వద్దని గొడవ పడుతున్నాడు. ఈ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన భాను గురువారం ఇంట్లో ఎవరులేని మయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రాల్ ప్రో టెక్నో క్రాఫ్ట్ పరిశ్రమ సీజ్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండలం తుర్కల ఖానాపూర్ గ్రామంలోని రాల్ ప్రో టెక్నో క్రాఫ్ట్ పరిశ్రమపై పీసీబీ అధికారులు చర్యలు చేపట్టారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట బ్రిడ్జి సమీపంలోని నక్కవాగులోకి ట్యాంకర్ ద్వారా అక్రమ వ్యర్థాలను వదులుతుండగా గత నెల నవంబరు 29న రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పీసీబీ అధికారులకు పట్టుకున్నారు. ఆ వాహనానికి నేమ్‌ప్లేట్, రిజిస్ట్రేషన్ నంబర్ కూడా లేదు. ఈ క్రమంలో ట్యాంకర్ డ్రైవర్ తప్పించుకుని పారిపోగా డ్రైవర్‌కు సహాయకునిగా ఉన్న కేతావత్ దేవదాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సదరు పరిశ్రమ నుంచి తీసుకువచ్చినట్లు తెలిపాడు. ట్యాంకర్ నుంచి నమూనాలను సేకరించి పరీక్షించగా, ఆ పరిశ్రమకు చెందినవిగా తేలడంతో కేసు నమోదు చేయించారు. విచారణలోనూ నిజమని తేలడంతో ఆ పరిశ్రమ మూసివేతకు పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు.


దత్తాచల క్షేత్రం..


దత్తాత్రేయ స్వామి

మహిమాన్వితం.. దత్తాచల క్షేత్రం..

● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

హత్నూర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపమే శ్రీ దత్తాత్రేయస్వామి. దత్తాత్రేయుడి అవతారమైన శ్రీ నరసింహ సరస్వతి, తపోభూమి అయిన ప్రధాన శిష్యులు నామదారకులు తపస్సు చేసిన పుణ్య భూమి దత్తాచల క్షేత్రం. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం హత్నూర-మధుర గ్రామాల శివారులోని గుట్టల్లో వెలిసిన ఈ దత్తాచల క్షేత్రం (దత్తయ్య గుట్ట) కొలిచినవారికి కొంగుబంగారంగా వర్ధిల్లుతున్నది.

7 నుంచి బ్రహ్మోత్సవాలు

దత్తాచల క్షేత్రం బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుంచి 15వ తేదీవరకు నిర్వహించనున్నట్లు క్షేత్రాధిపతి, ఉపాసకులు సభాపతిశర్మ తెలిపారు. రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంటరీ ఇన్‌చార్జి నీలం మధు తదితరులు దత్తాత్రేయ స్వామి ఉత్సవాలలో పాల్గొననున్నారు. ఈ ఆలయం హైదరాబాద్ పట్టణానికి 60కిలో మీటర్లు, పటాన్‌చెరు నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి దౌల్తాబాద్ మీదుగా క్షేత్రం వరకు రోడ్డు మార్గన ఆలయానికి చేరుకోవచ్చు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం..

కొంతమంది దాతలు ముందుకు రావడంతో ఐదేళ్ల క్రితం ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు క్షేత్రాధిపతి, శ్రీచక్ర ఉపాసకులు సభాపతి శర్మ తెలిపారు. ఇప్పటికీ 90శాతం పనులు పూర్తయ్యాయని, ఆయలంలో స్వామివారి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించినట్లు తెలిపారు. మరి కొంత మంది దాతలు ముందుకొస్తే పూర్తి స్థాయిలో దేవాలయ నిర్మాణం పూర్తవుతుందన్నారు.

రాతి బండపై పాదుకలు

దత్తాచల క్షేత్రంలోని గుట్టలోని ఓ పెద్ద రాతి బండపై దత్తాత్రేయ స్వామివారి పాదుకలు ఉన్నాయి. ఈ పాదుకలను భక్తులు పూజించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గత కొన్నేళ్ల నుంచి బ్రహ్మోత్సవాలను ఈ క్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారు, దత్త జయంతి, గురుపౌర్ణమి, వసంత పంచమి, ప్రతీ గురువారం ప్రత్యేక పూజలు వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దత్తాచల క్షేత్రంలో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు



చతుర్విధ జల ప్రక్రియకు
నిదర్శనమే గొటిగార్‌పల్లి

● రాజ్యసభలో గ్రామం పేరును ప్రస్తావించిన సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్




గొటిగార్‌పల్లిలో చిన్న చెక్‌డ్యామ్‌లో నిల్వ ఉన్న వర్షపు నీరు, రాజ్యసభలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

కోహీర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వర్షపు నీటిని ఒడిసిపట్టి, చతుర్విధ జల ప్రక్రియ ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని, దీనికి నిదర్శనమే రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగార్‌పల్లి అని ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ప్రస్తావించారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివాష్ నారాయణసింగ్ నీటి లభ్యత, నీటి కొరత నివారణపై మాట్లాడేందుకు డాక్టర్ లక్ష్మణ్‌కు అవకాశం కల్పించగా మాట్లాడారు. గొటిగార్‌పల్లిలో 2001-2002 సంవత్సరంలో విశ్రాంత ఇంజినీర్, జలవనరుల నిపుణులు టి.హనుమంతరావు మట్టికట్టలతో చతుర్విధ జల ప్రక్రియతో ఎకరానికి రూ.5000 ఖర్చుతో చిన్నచిన్న చెక్‌డ్యాములు నిర్మించి, వర్షపు నీటిని నింపారన్నారు. అక్కడ 23 సంవత్సరాలుగా రైతులు సంవత్సరానికి మూడు పంటలు పండిస్తున్నారని ప్రస్తావించారు. దీనిని రాజస్థాన్ ప్రభుత్వ బృందం పరిశీలించి, ఎడారి ప్రాంత జిల్లాలోనూ అవలంబించారని పేర్కొన్నారు. అతి తక్కువ ఖర్చుతో భూగర్భ జలాలు పెంచే ఆలోచన చేయకుండా రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రభుత్వాలు ఎకరానికి ఎనిమిది లక్షల వరకు అధికంగా ఖర్చు చేసి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. ప్రజాధనం వృథా కాకూడదు అంటే చతుర్విధ జల ప్రక్రియను దేశంలోని అన్ని ప్రాంతాల్లో చేపట్టాలని సభలో పేర్కొన్నారు.

రైలుబండి.. ఎక్కలేమండి!



మెదక్ రైల్వే స్టేషన్

రూ.కోట్ల వ్యయంతో రైల్వేలైన్.. వచ్చేది ఒకటే రైలు

● అది జనానికి అనుకూలంగా లేని టైంలో..
● ఎక్కేవారు పదుల సంఖ్యలో
● మెదక్ రైల్వేస్టేషన్ తీరిది
● సమయానుకూలంగా రైళ్లు పెంచాలని కోరుతున్న ప్రయాణికులు

మెదక్, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి) : మెదక్‌కు రైలొచ్చినా లేనట్టుగానే ఉంది. దశాబ్దాల కలైన రైల్వేలైన్ అయితే సాకారమైనప్పటికీ వచ్చేది మాత్రం ఒకటే రైలు. మెదక్‌కు మొక్కుబడిగా ఒక ప్యాసింజర్ రైలును మాత్రమే నడిపిస్తున్నారు. అదీ ఉదయం వస్తే, మళ్లీ సాయంత్రం వెళ్తుంది. అనుకూలమైన వేళల్లో రైలు లేకపోవడంతో ప్రయాణికులు ఇటువైపు తొంగిచూడడం లేదు. దీంతో రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వేస్టేషన్ నిర్మానుష్యంగా మారింది. ఎన్నో ప్రయాసలు పడి సాధించుకున్న రైల్వేలైన్ స్థానికులకు అక్కరకు రాకుండా పోతుంది. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ మెదక్ పార్లమెంట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన 1982 నుంచి ఇక్కడ రైల్వే సదుపాయం కల్పించాలనే డిమాండ్ మొదలైంది. మెదక్ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాల జరిగాయి. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం రైల్వేలైన్, మెదక్ రైల్వేస్టేషన్ పనులను పూర్తిచేసుకుని రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీన్ని పూర్తిస్థాయిలో వినియోగానికి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

అటు.. ఇటు అంతే!

అక్కన్నపేట నుంచి మెదక్ వరకు 17.2 కిలోమీటర్లు బ్రాడ్‌గేజ్ లైన్‌ను వేశారు. రామాయంపేట మండలం లక్ష్మాపూర్, హవేళీఘనపూర్ మండలం శమ్నాపూర్, మెదక్ పట్టణంలో దక్షిణ మధ్యరైల్వే అధికారులు రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేశారు. రైల్వేలైన్‌ను మెదక్ రైల్వేస్టేషన్ వరకే నిర్మించారు. దీంతో రైళ్లకు ప్రారంభ, గమ్యస్థానంగా మెదక్ రైల్వేస్టేషన్ మిగిలిపోయింది. ప్రతీరోజు ఈ రెండు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఈ లైన్ గుండా నడుస్తున్నాయి. కాచిగూడ నుంచి మెదక్‌కు 07577 సర్వీస్ రైలు ఉదయం 7.45కు బయలుదేరి 11.10కు చేరుతుంది. తిరిగి 07578 సర్వీస్ మెదక్ నుంచి కాచిగూడకు తిరిగి సాయంత్రం 5 గంటలకు బయలు దేరి రాత్రి 8.10కు చేరుతుంది. ఈ రైళ్లు మెదక్‌తో కలిపి మొత్తం 17 చోట్ల ఆగుతుంది. సీతాఫల్‌మండి, మల్కాజ్‌గిరి, కవ్రీ బ్యారెక్స్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, మేడ్చేల్, డబిల్‌పురా, మనోహరాబాద్, మాసాయిపేట, శ్రీనివాసనగర్, వడియారం, మీర్జాపల్లి, అక్కన్నపేట, లక్ష్మాపూర్, శమ్నాపూర్ స్టేషన్లలో హాల్ట్ అవుతుంది. ఈ లైన్‌పై మెదక్ వాసులు, చుట్టుపక్కల మండలాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ నిత్యం ప్యాసింజరు రైలు సర్వీసుతోనే సరిపెట్టారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణీకులు సికింద్రాబాద్, నిజామాబాద్ తదితర పట్టణాలకు వెళ్లి అక్కడి నుంచి తమ ప్రయాణాలకు సిద్ధం కావాల్సి వస్తోంది. మెదక్ నుంచి తిరుపతికైనా రైలును నడిపించాలని మెదక్ జిల్లావాసులు కోరుతున్నారు.

వేళకు లేని రైలు

మెదక్ పట్టణంలో వివిధ పనులు చేసే ఉద్యోగులు, పనుల నిమిత్తం హైదరాబాద్ నుంచి రోజు ఇక్కడికి వచ్చే వారు అధిక సంఖ్యలో ఉంటారు. తిరిగి సాయంత్రం ఆఫీసు వేళల తర్వాత హైదరాబాద్ చేరుకుంటారు. ప్రస్తుతం మెదక్ వచ్చే రైళ్ల రాకపోకల సమయాలు ఉద్యోగులకు అనుకూలంగా లేకపోవడంతో బస్సు ప్రయాణాలే వారికి దిక్కయ్యాయని వాపోతున్నారు. సాయంత్రం 5.30 వరకు కార్యాలయాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. రైలు సాయంత్రం 5 గంటలకే మెదక్‌స్టేషన్ నుంచి బయలుదేరడంతో వారు అందుకోలేకపోతున్నారు. గతంలో సాయంత్రం 4 గంటలకే బయలుదేరేది. అధికారులకు అనేక వినతుల తర్వాత 5 గంటలకు మార్చారు. మరో అరగంట అనంతరం బయలుదేరేలా సమయం మారిస్తే బాగుంటుందనే డిమాండ్ వెల్లువెత్తుతుంది. అలాగే కాచిగూడ నుంచి ప్రారంభమయ్యే ప్యాసింజర్ రైలు మెదక్‌స్టేషన్ చేరుకోవడానికి ఉదయం 11.30 అవుతుంది. అది ఎక్కినా ఆఫీసు వేళకు కార్యాలయానికి చేరుకోవడం సాధ్యపడదు. అలాగే ఎంతోమంది ఎన్నో పనులు, ఉద్యోగం నిమిత్తం మెదక్ నుంచి హైదరాబాద్‌కు రోజు వెళ్లివస్తున్నారు. వారి కోసం రైలు సర్వీసే లేదు.

అదనపు రైళ్లు నడిపించరూ..!

మెదక్ జిల్లా నుంచి మహారాష్ట్రకు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా షిరిడీ క్షేత్రానికి వెళ్లే వారు అధిక సంఖ్యలోనే ఉంటారు. దీంతో సికింద్రాబాద్ - మన్మాడ్ మీదుగా నడిచే రైళ్లను మెదక్ వరకూ పొడిగించాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కాచిగూడ - మెదక్ మధ్యనే రెండు ప్యాసింజర్ రైళ్లు నడపడం మూలంగా ప్రయాణికులు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో ఇందులో ప్రయాణికుల సంఖ్య పదుల సంఖ్య దాటడం లేదు. ప్యాసింజర్ రైళ్లను పెంచి, సమయానుకూలంగా నడిపించడంతో పాటు, దూరప్రాంతాలకు మెదక్ నుంచి రైలు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులు ఇటువైపు మొగ్గుచూపుతారని, పలువురు అభిప్రాయ పడుతున్నారు.



గూడ్స్ రవాణా సేవలు ప్రారంభించడం పట్ల స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్‌ను అభినందిస్తున్న అధికారులు

గూడ్స్‌రైళ్లు షురూ..

ప్యాసింజర్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మెదక్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రేక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. మెదక్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బాయిల్డ్ రైస్‌ను గూడ్స్ ద్వారా తరలిస్తుంది. దీంతో మెదక్ స్టేషన్ నుంచి వస్తు రవాణా ప్రారంభమైందని స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

ఉపాధిహామీ పనుల్లో ఇన్ని అవకతవకలా?

ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆడిటింగ్ అధికారులు

చిలప్‌చెడ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు, తప్పులపై ఆడిటింగ్ అధికారులు ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చిలప్‌చెడ్‌లో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై ఆడిటింగ్ నిర్వహించామని, చాలా అవకతవకలను గుర్తించినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో పనులు చేయని కూలీలకు పేమెంట్లు జరిగాయని, మరికొన్ని గ్రామాల్లో పని చేసిన వారికి పూర్తిగా డబ్బులు చెల్లించలేదని మండిపడ్డారు. సిటిజన్ చార్టులు, పనికి సంబంధించిన యాప్ వాడడం తెలియని సిబ్బంది ఉండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గన్యా తండాలో హక్కుదారుకు బదుల 9వ తరగతి చదువుతున్న అమ్మాయితో పని చేయించారని తెలిపారు. గుజిరి తండాలో డిగ్రీ చదువుతున్న అమ్మాయికి 100 రోజులు పని చేయకున్నా పేమెంట్ చేశారని పేర్కొన్నారు. రికార్డులను కూడా సక్రమంగా రాయలేదని సామాజిక తనిఖీలో చాలా లోపాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, ఈజీఎస్ ఏపీడీ రంగాచార్యులు, హెచ్ఆర్ రాజేందర్, ఎస్ఆర్పీ జీవన్, ఎస్క్యూసీ జ్యోతి, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, పీఆర్ఏఈ మధుబాబు, ఏపీవో శ్యామ్‌కుమార్, ఈసీ, డీఆర్పీడబ్ల్యూ, వీఆర్పీడబ్ల్యూ, టీఏలు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



గ్రామసభలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కస్తూర్బాలో ఏం జరిగింది?

● గాయపడిన విద్యార్థినికి న్యాయం చేయాలని ఆందోళన



విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న కాలనీవాసులు

రామాయంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భవనం మెట్లపై నుంచి జారి తీవ్రంగా గాయపడ్డ కస్తూర్బా విద్యార్థిని ఘటన ఆందోళనకు దారితీస్తోంది. బాలికకు కాలు, చేయి, పక్కటెముకలు విరిగినట్లు తెలుస్తోంది. సదరు బాలిక ప్రమాదవశాత్తు పడిపోయిందా లేదా మరేదైనా జరిగిందా అన్న నిజాలు తేలాల్సి ఉంది. ఘటనపై అనుమానాలు ఉన్నాయని బాలిక నివాసం ఉంటున్న కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రామాయంపేట కస్తూర్బా విద్యాలయం ఎదుట గంటపాటు ఆందోళన చేపట్టారు. రేణుకకు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించాల్సింది పోయి గాంధీ ఆసుపత్రిలో చేర్పడమేమిటని ప్రశ్నిస్తున్నారు. బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకోగా వారి మాటను వినలేదు, సమాచారం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్ విద్యాలయానికి చేరుకున్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందిస్తామని వారికి నచ్చచెప్పారు. స్వయంగా కలెక్టర్ గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి ప్రత్యేక వైద్యం అందేలా చూస్తున్నారని తెలిపారు. కాగా రేణుక జారిపడ్డ ఘటనపై ఎస్ఐ బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శీతాకాలం.. జీవాలు పైలం!

● మేకలు, గొర్రెలకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం
● అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పశు వైద్యులు

చిన్నకోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుంది. దీనితో మేకలు, గొర్రెలకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. దీనితో పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారిణి మంజుల సూచిస్తున్నారు.

● జలుబు, దగ్గు సోకినప్పుడు జీవాలకు తుమ్ములు, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. పాక ఇరుకుగా ఉండటం, గాలి సరైన వెలుతురు లేకపోవడం అదేవిధంగా తడి, తేమ ఎక్కువగా ఉండటం, కాలుష్యం, దుమ్ము వాతావరణంలో ఆకస్మాత్తుగా వచ్చే మార్పులు వీటికి కారణమవుతాయి. క్రిముల ద్వారా సోకే అంటు వ్యాధులతో పాటు బయట నుంచి ఆహారం ద్వారా శ్వాస కోశంలోకి వచ్చే కణాలు జలుబు, దగ్గుకు కారణమవుతాయి. నివారణకు పాకలోకి గాలి, వెలుతురు సరిగా వచ్చేలా చూడాలి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచుకోవాలి.

● షీప్ పాక్స్ గొర్రెలకు మాత్రమే వచ్చే వ్యాధి. ఇది సోకిన జీవాలకు చర్మంపై దద్దురులు వస్తాయి. జ్వరం తీవ్రంగా ఉండటం, మేత మేయకపోవడం ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లయితే సుడితో ఉన్న గొర్రెల్లో ఈడుచుకుపోయే అవకాశం ఉంటుంది. జీవాలకు ఏమైనా వ్యాధులు సోకితే పశు వైద్యాధికారులను సంప్రదించాలి

తగు జాగ్రత్తలు తీసుకోవాలి



శీతాకాలం జీవాల విషయంలో పెంపకం దారులు ఎక్కువగా శ్రద్ధవహించాలి. జీవాలు చలికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమైనా వ్యాధులు సోకితే పశు వైద్యాధికారులను సంప్రదించాలి.

- మంజుల, మండల పశువైద్యాధికారిణి, చిన్నకోడూరు



పెద్దకోడూరులో మేకలకు వేస్తున్న వ్యాక్సిన్ (ఫైల్)

ట్రాక్టర్ల నుంచి
బ్యాటరీల చోరీ

● నర్సాయపల్లిలో వరుస దొంగతనాలతో రైతుల ఆందోళన

మద్దూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు రైతుల ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు చోరీకి గురైన ఘటన గురువారం రాత్రి నర్సాయపల్లిలో చోటుచేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం.. కవ్వం బాస్కర్‌రెడ్డి, చల్లా హన్మంతరెడ్డి, చల్లా సుదర్శన్‌రెడ్డి తమ పొలాలను దున్ని కేజీ వీల్స్ తొలగించకుండానే ట్రాక్టర్‌ను చెట్టు వద్ద పెట్టుకుని ఇంటికి వెళ్లారు. తెల్లవారి పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను ఆన్‌చేయగా, కాకపోవడంతో బ్యాటరీలు చోరికి గురయ్యాయని గుర్తించారు. వరుస దొంగతనాలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వే కోసం ఫోన్ చేసినా స్పందించని ఎన్యూమరేటర్లు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కులగణన సమగ్ర కుటుంబ సర్వే సమయంలో ఇళ్ల వద్ద లేని కుటుంబాల వివరాలను సేకరించేందుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి టోల్ ఫ్రీ నంబర్ 08455-276155ను ఏర్పాటు చేశారు. ఈ నంబర్‌కు ఎవరైనా ఫోన్‌చేసి సమాచారం అందిస్తే తిరిగి వారి వద్దకు వెళ్లి ఎన్యూమరేటర్లు కుటుంబ సమగ్ర సర్వే చేస్తారని కలెక్టర్ సూచించారు. కానీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి మూడు రోజులైనా ఇంతవరకు సర్వే చేసేందుకు ఎవరు రాలేదని పలువురు స్థానికులు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్‌కు తిరిగి ఫోన్‌చేసి ఇంతవరకు రాలేదని చెప్పగా తాము ఎన్యూమరేటర్లకు సమాచారం ఇచ్చామని చేతులు దులుపుకుంటున్నారు.

ఎన్‌కౌంటర్ ఎక్కడైనా.. ఉలికిపాటు ఇక్కడే!

ఐదో పేజీ తరువాయి

కట్ట రామచంద్రారెడ్డి అలియాస్ విజయ్ అలియాస్ గుడ్సా ఉసెండీ అలియాస్ రాజు దాదా 31 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పీపుల్స్ వార్ వైపు ఆకర్షితులయ్యారు. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఈస్ట్ బస్తర్ అధికార ప్రతినిధిగా ఉన్న ఈయనపై రూ.20లక్షల రివార్డు ఉంది.

● మద్దూరు మండలం కూలిగల్‌కు చెందిన కుంకటి వెంకటయ్య అలియాస్ శివన్న, అలియాస్ వికాస్ గత 30ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో ఉన్నారు. సౌత్ బస్తర్ స్పెషల్ కమాండర్‌గా, దండకారణ్యం స్పెషల్ జోన్ సెక్రటరీగా ఉన్న వెంకటయ్యపై రూ.20 లక్షల రివార్డు ప్రకటించారు.

● మిరుదొడ్డి మండలం ధర్మారంకు చెందిన రంగనబోయిన భాగ్య లియాస్ కల్పన, అలియాస్ రూపి 20ఏళ్ల నుండి వివిధ హోదాల్లో కొనసాగుతున్నారు. నార్త్ బస్తర్‌లోని ప్రతాపూర్ ఏరియా కమాండర్‌గా వ్యవహరిస్తున్న భాగ్యపై రూ.4లక్షల రివార్డు ప్రకటించారు.


● నంగునూరు మండల కేంద్రానికి చెందిన రంగు అరుణ అలియాస్ పద్మక్క గత 17 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీలో యాక్షన్ టీం మెంబర్‌గా ఉన్న పద్మక్కపై రూ.2లక్షల రివార్డు ఉంది.

● అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశబోయిన స్వరూప మావోయిస్టు పార్టీపై ఆకర్షితురాలైంది. 20 ఏళ్ల క్రితం అజ్ఞాతంలో చేరి ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యంలో ఉన్నారు. ఈమెపై రూ.లక్ష వరకు రివార్డు ప్రకటించారు.

పింఛన్ ఇప్పించండి సారూ!

● ఆమెకు చూపులోపం... మతిస్థిమితం లేని కుమార్తె
● ఐదేళ్ల కొడుకు సహాయంతో ఎంపీడీవో కార్యాలయానికి
● అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశ

కోహీర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) భర్త లేని ఆమె.. పైగా చూపు లోపం.. మతిస్థిమితం లేని కుమార్తె, ఐదేళ్ల కొడుకును వెంటబెట్టుకుని పింఛన్ ఇప్పించండి సారూ అంటూ ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుతిరిగిన వైనం ఇది. కోహీర్ మండలంలోని కొత్తూర్ (కే) గ్రామానికి చెందిన మ్యాదపల్లి పద్మ భర్త వెంకటేశం 2024 ఫిబ్రవరిలో ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. దీంతో పద్మ కూలి పనికి వెళుతూ మతిస్థిమితం లేని తన కుమార్తె సౌమ్యను, కొడుకును పోషించుకుంటుంది. అయితే ఆమెకు చూపు మందగించడంతో కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం తనకు వితంతు, కూతురికి దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని గతంలో పంచాయతీ కార్యదర్శికి మొర పెట్టుకున్నది. ఆయన చొరవతీసుకొని పద్మ కుమార్తెను సదరం క్యాంపునకు తీసుకువెళ్లి దివ్యాంగుల సర్టిఫికెట్ ఇప్పించాడు. ఇప్పటివరకు కుమార్తెకు దివ్యాంగుల పింఛన్ మంజూరు కాలేదు. తన భర్త చనిపోయి 9 నెలలు గడుస్తున్నా ఆమె నుంచి ఇప్పటివరకు అధికారులు ఆసరా పింఛన్ దరఖాస్తు ఫారంను తీసుకోలేరు. దీంతో పద్మ ఎంపీడీవో కార్యాలయానికైనా వెళ్తే అధికారులు స్పందించి తనకు పింఛన్ మంజూరు చేస్తారేమోననే ఆశతో మతిస్థిమితం లేని తన కుమార్తెను, ఐదేళ్ల కొడుకు సహాయంతో శుక్రవారం కార్యాలయానికి వచ్చారు. అయితే అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆమెకు నిరాశ తప్పలేదు. ఇలాంటి వారికి కూడా ప్రభుత్వం చేయూత ఇవ్వకపోతే ఎలాగని కార్యాలయానికి వచ్చిన మిగతావారు ప్రభుత్వంపై మండిపడ్డారు.



పింఛన్ దరఖాస్తు ఫారంతో కోహీర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పద్మ, ఆమె కూతురు సౌమ్య, కుమారుడు

భూసార పరీక్షలేవి?

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పంటల సాగుకు భూసార పరీక్షలే కీలకం. పోషకాల సమతుల్యతను పాటించేందుకు ఈ పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయి. అధిక దిగుబడి సాధించేందుకు రైతులు తమ భూముల్లో ఉన్న పోషక పదార్థాల స్థాయి ఎంత మేరకు ఉన్నదనే విషయాన్ని తెలుసుకోవాలి. రైతుల వద్దకు వెళ్లి భూసార పరీక్షలపై అవగాహన కల్పించే బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉన్నది. కానీ, భూసార పరీక్షలను ఎక్కడ నిర్వహించడం లేదు.

సంగారెడ్డి జిల్లాలో 3,63,544 రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. వారికి భూసార పరీక్షలపై అవగాహన లేక చేయించడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షలను చేయించి, భూసారాన్ని నిర్ధారించి అన్నదాతలు వేయాల్సిన పంటలకు నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులు ఎంత మోతాదుల్లో వాడాలనే విషయాలను సూచించాలి. సాగుకు అనుకూలంగా లేని భూములను గుర్తించి ఇతర పద్ధతులను తెలియజేసి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు భూసార పరీక్షలపై ఎలాంటి అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు రైతుల పొలాల్లోని మట్టి నమూనాలను సేకరించి, వాటికి మాత్రమే పరీక్షలు చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పంటలు సాగు చేసే ముందు వ్యవసాయ శాఖాధికారులు రైతులతో సమావేశం నిర్వహించి భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలి. రైతులు తమ పొలాల్లో మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, వాటిని ఏ మోతాదులో భూసార కేంద్రాల్లో సమర్పించాలనే విషయాలపై సూచించాలి. కానీ అధికారులు ఇవేమీ చేయడం లేదు.



సంగారెడ్డిలోని భూసార పరీక్షల కేంద్రం కార్యాలయం

భూసార పరీక్షల గురించి ఎవరు చెప్పలేదు



తమ పంటలకు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఇంత వరకు ఎవరు చెప్పలేదు. భూసార పరీక్షలతో తమకు లాభం ఉంటుందంటే ఎందుకు చేయించుకోము. భూమి ఉన్నది కాబట్టి ఏదో ఒక పంట వేయాలి కాబట్టి లాభమో నష్టమో వరి పండిస్తున్నాము. మట్టిని ఎలా సేకరించాలి, ఎక్కడి ఇవ్వాలనే విషయాలు కూడా మాకు తెలీదు.

- కుమార్, రైతు, తాళ్లపల్లి

రైతుల వద్దకు వెళ్లి భూసార పరీక్షలు చేయాలి



రైతులు తమ వ్యవసాయ భూమిలోని మట్టిని తీసుకువచ్చి కార్యాలయంలో ఇస్తేనే అధికారులు భూసార పరీక్షలు చేస్తామనడం సరికాదు. మట్టిని ఎలా సేకరించాలి, ఎంతో మోతాదులో సేకరించాలనే విషయాలు తెలియవు. వ్యవసాయ శాఖాధికారులు రైతుల వద్దకు చెప్పాలి. పంటలు నష్టపోకుండా రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించాలి.

- జయరాజ్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

పదోన్నతితో మరింత బాధ్యత

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని సంగారెడ్డి ఎస్పీ సీహెచ్. రూపేష్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలోని ఫింగ్ ప్రింట్ బ్యూరోలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పింకీ కుమారికి ఎస్ఐగా పదోన్నతి లభించింది. ఫింగ్ ప్రింట్ విభాగంలో గత నాలుగేళ్లుగా ఆమె పనిచేస్తుంది. ఇటీవల ఆమెకు పదోన్నతి లభించడంతో శుక్రవారం ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఖేడ్‌లో ఆశా వర్కర్ల ధర్నా

నారాయణఖేడ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి నెలా ఖచ్చితంగా రూ.18 వేల వేతనం చెల్లించాలని ఆశా వర్కర్లు నారాయణఖేడ్‌లోని క్లస్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి యశోద, ఉపాధ్యక్షులు ప్రశాంతి, గంగమణి మాట్లాడుతూ తమకు పెండింగ్‌లోఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ పలు డిమాండ్లు చేశారు.




ఖేడ్‌లో ఉన్ని దుస్తులను కొనుగోలు చేస్తున్న జనం, చలి నుంచి ఉపశమనం కోసం చలిమంట వేసుకున్న చిన్నారులు, యువకులు

ఉన్ని దుస్తులకు భలే గిరాకీ

నారాయణఖేడ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గంలో రోజురోజుకూ చలి తీవ్రత అధికమౌతుండడంతో చలినుండి రక్షణ కోసం జనాలు ఉన్ని దుస్తులను కొనుగోలుచేస్తున్నారు. గత రెండు నెలలుగా సీజనల్ వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి నారాయణఖేడ్‌కు వచ్చి ఉన్నిదుస్తుల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నప్పటికీ, చలి తీవ్రత అంతగా లేకపోవడంతో వ్యాపారాలు అంతంతమాత్రంగానే సాగాయి. అయితే గత పది రోజులుగా చలి తీవ్రత పెరగడంతో, జనాలు ఉన్నిదుస్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జనాల అవసరాలకు అనుగుణంగా అందరికీ సరిపోయేలా ఉన్ని దుస్తులను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ.100 నుంచి 1000 వరకు స్వెటర్లు, జర్కిన్‌లు, విక్రయిస్తుండగా, మంకి క్యాప్‌లు నాణ్యతను బట్టి రూ.50 నుంచి రూ.200 ల వరకు, చేతులకు గ్లౌజులు సైతం విక్రయిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ఉన్న వారు రూం హీటర్లను కూడా కొనుగోలు చేస్తున్నారు. చలి తీవ్రత వల్ల రూం హీటర్ల కొరత కూడా ఉంది. గ్రామాల్లో తెల్లవారుజామున చలి తీవ్రత అధికంగా ఉండడంతో చలి మంటలు కాచుకుంటున్నారు. ఏదిఏమైనా చలి తీవ్రత పెరగడంతో సీజనల్ వ్యాపారుల ఉన్నిదుస్తులకు డిమాండ్ పెరిగి వ్యాపారాలు ఊపందుకున్నాయి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి: మెదక్ కలెక్టర్

● విద్యాసంస్థల్లో అధికారుల తనిఖీలు

చిన్నశంకరంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి ఆదర్శ పాఠశాల విద్యార్థులను పాఠ్యాంశాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు గణితం పై బోధన చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సందర్శించి ఆహారపదార్థాలు, సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా హాస్టళ్లు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాలల స్థితిగతులపై ప్రిన్సిపాల్ వాణి, విశ్వ గీతతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, ఆర్ఐ, పలు శాఖల సిబ్బంది ఉన్నారు.



చిన్నశంకరంపేట కేజీబీవీలో పప్పు దినుసులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

● మెదక్ అర్బన్: విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం వరం లాంటిదని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయ ఆవరణలో గృహజ్యోతి పథకంపై నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1.26 లక్షల గృహాలకు రూ.31.36 కోట్ల వరకు విద్యుత్ వినియోగదారులకు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో గృహజ్యోతి పథకం వంద శాతం అమలైందన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్ కోఎస్ఈ శంకర్, డీఈ ఆపరేషన్ చాంద్ షరీఫ్ బాషా, డీఈ టెక్నికల్ శ్రీనివాసవిజయ్, తూప్రాన్ డీఈ ఆపరేషన్ రాజు, ఏడీ, ఏఈ పాల్గొన్నారు.

● హవేళిఘణపూర్: మండల కేంద్రంలోని డైట్ కళాశాలను అదనపు కలెక్టర్ మెంచు నగేష్ శుక్రవారం సందర్శించారు. అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని డైట్ కళాశాల ప్రాంగణంలోని హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలతో పరిశీలించారు.

● టేక్మాల్: పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. టేక్మాల్ జడ్పీ పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం డేటా ఎంట్రీని పరిశీలించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెంట తహసీల్దార్, ఎంపీడీవో ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పాఠశాలల అభివృద్ధి పనుల్లో

వేగం పెంచండి: కలెక్టర్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం విద్యాశాఖ, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రతి విద్యాసంస్థలో తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికలను సమర్పించాలని, ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన పనుల వివరాలను కూడా సమర్పించాలని వసతిగృహ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, టీడబ్ల్యూ ఈఐడీ ఇంజనీరింగ్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంకా పూర్తికాని పనులను గుర్తించి వాటి ప్రాధాన్యతను బట్టి నివేదికలు రూపొందించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో మరమ్మతులు ఇంకా మిగిలి ఉన్నవాటిని గుర్తించి వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారాలతో కూడిన భోజనం అందించాలన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఈఈపీఆర్ జగదీష్, డీఈవో వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమాధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్‌పార్కు అభివృద్ధి కోసం..

రూ.5 కోట్లతో ప్రతిపాదనలు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌శివార్లలో జుక్కల్ పరిధిలో అసంపూర్తిగా ఉన్న అర్బన్‌పార్కు నిర్మాణం పనులను పూర్తిచేయించడానికి, రూ.5 కోట్లనిధులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, రేంజ్‌అధికారి అనురాధతో కలిసి అర్బన్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, రేంజ్‌అధికారి అనురాధలతో ఆయా విషయాలపై సమీక్షించారు. ఆయన వెంట జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, ఫారెస్ట్‌రేంజ్ అధికారి అనురాధ, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, గుండేరావు, తదితరులు ఉన్నారు. కాగా అంతకుముందు మున్సిపల్‌కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల సమావేశంలో మహిళాసంఘాలకు కోటి రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖేడ్‌పట్టణంలోని మున్సిపల్ కార్మికులను ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి శాలువాలతో సన్మానించి స్వెటర్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్‌జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ ఎషెట్కార్, వైస్ చైర్మన్‌దారం శంకర్, శానిటేషన్‌అధికారి శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలపరిధిలోని శాపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మెతడిస్టు చర్చికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్థులు శాలువాలతో సన్మానించారు.

నేటి నుండి సీఎంకప్ క్రీడలు

జహీరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీ నుంచి సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 7,8న గ్రామస్థాయిలో, అలాగే 10,11,12 తేదీల్లో మండలస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్14, అండర్18 బాల, బాలికల విభాగాల్లో పోటీల్లో ఉంటాయన్నారు. కబడ్డి, ఖోఖో, వాలిబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్, యోగ, తదితర పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పంచాయతీ కార్యదర్శులను, ఎంపీడీవో కార్యాలయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

● రేగోడు: సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, మెదక్ జిల్లా మత్స్యశాఖ ఏడీ మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ పోటీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామమ్మ, తహసీల్దార్ నరేష్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఎంఈఓ గురునాథ్ గ్రామ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మెదక్‌లో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మెదక్ అర్బన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంగటి యాదగిరి ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో రాధాకిషన్‌ను కలిసి వినతి పత్రం అందేశారు.

విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ

శివ్వంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేసినట్లు సంఘ సేవకుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పాంబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం సొంత నిధులతో స్వెటర్లు పంపిణీ చేశారు.

వృత్తి విద్యపై అవగాహన

రేగోడు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రేగోడు మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రి సహకారంతో ఆసుపత్రిసేవలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ, వృత్తి విద్యా శిక్షకులు గీతా తెలిపారు.

అక్రమ అరెస్టులతో నిజాలను దాచలేరు

● బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేయడమే కాకుండా ప్రశ్నించే ప్రతిపక్షం గొంతునొక్కినంత మాత్రాన నిజాన్ని దాచలేరని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ట్యాంక్‌బండ్‌పై ధర్నాకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఉదయమే కొంపల్లిలోని పద్మాదేవేందర్ రెడ్డి నివాసానికి పేట్‌బషీరాబాద్- కొంపల్లి పోలీసులు చేరుకొని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.



మెదక్ మున్సిపాలిటీ:కొంపల్లి నివాసంలో పద్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

వివిధ మండలాల్లో..

రామచంద్రాపురం/కొండాపూర్/గుమ్మడిదల/నారాయణఖేడ్/జహీరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ శుక్రవారం నగరంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు హాజరు కాకుండా వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. భారతి నగర్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శ రెడ్డిని వారి నివాసంలో రామచంద్రాపురం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కొండాపూర్ మండలంలో మాజీ సర్పంచ్‌లు రుక్మోద్దీన్, సత్యానందం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవి, అరవింద్‌రెడ్డి,ప్రవీణ్,ప్రభు,బుచ్చయ్య తదితరులను పోలీసులు ముందస్తు అరెస్టుచేసి వారు ఛలో ట్యాంక్‌బండ్ కార్యక్రమానికి తరలకుండా అడ్డుకున్నారు. గుమ్మడిదల మండలంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని వారి నివాసాల వద్ద నుండి అరెస్టు చేసి గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నారాయణఖేడ్‌లో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, నియోజకవర్గ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు మల్గొండ, అంజయ్య, ఇతర నాయకులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జహీరాబాద్‌లో బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టునారాయణ, మాజీకౌన్సిలర్ నామకిరణ్ తదితరులను అరెస్టు చేశారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



దీక్షలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

మెదక్ అర్బన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 556 మంది ఉద్యోగులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. రెగ్యులరైజ్ ఆలస్యమైతే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, కోశాధికారి సంపత్, సీఆర్పీల కార్యదర్శి రాజు, ఐఏఆర్పీ కనకరాజు, ఎంఎస్ అంజనేయులు,మెసెంజర్ రమేష్ పాల్గొన్నారు.

సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెలు శుక్రవారం ప్రారంభం కాగా తొలి రోజు పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. టీపీటీఎఫ్, ఎస్టీయూ తదితర సంఘాలు మద్దతు తెలియజేశాయి. ఈ నెల 7వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో సమ్మెలోకి వెళ్లనున్నట్లు జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు తలచుకుంటే ఏదైనా సాధ్యమే



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న క్షితిజ

రామాయంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎంచుకున్న పనిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ ఎస్.క్షితిజ అన్నారు. మీరు తలుచుకుంటే సాధించనిదంటూ ఏమీ లేదని తెలిపారు. మెదక్ జిల్లా రామయంపేట మండలం కోనాపూర్, ధర్మారం ప్రాంతాల్లో గత వంద రోజులుగా 50 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ నేర్పారు. శుక్రవారం రామాయంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ పొందినవారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. మెదక్ జిల్లా ఈడీ విజయలక్ష్మి, న్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు భూమిపూజ



చిన్నశంకరంపేట: సూరారం హైస్కూల్లో గదుల నిర్మాణానికి భూమి పూజ

చిన్నశంకరంపేట/తూప్రాన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ గదుల నిర్మాణానికి కృషిచేసిన టైటాన్స్ రౌండ్ టేబుల్ చారిటబుల్ ట్రస్ట్ కృషి అభినందనీయమని డీఈవో రాధాకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సూరారం హైస్కూల్లో వీఎస్టీ ఇండస్ట్రీస్ హైదరాబాద్ సౌజన్యంతో టైటాన్స్ రౌండ్ టేబుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు తరగతి గదులు, టాయిలెట్ గదుల నిర్మాణానికి డీఈవో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం ట్రస్టు సభ్యులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, సాయిరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ స్టార్ ఆధ్వర్యంలో పేద, తల్లి, తండ్రి లేని 25 మంది విద్యార్థులకు రూ. 40వేల విలువైన దుప్పట్లు అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డిని డీఈవో సన్మానించారు.

'శివారు కాలనీల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం'

పటాన్‌చెరు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): శివారు కాలనీల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నందన్‌ప్యారడైజ్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న జనావాసాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో కాలనీసంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి: టీయూడబ్ల్యూజే

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటనలో ఓ మీడియాకు చెందిన ఫొటోగ్రాఫర్ కృష్ణ పట్ల దురుసుగా ప్రవర్తించిన జోగిపేట సీఐ అనిల్ కుమార్‌పై, ఇతర పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ క్రాంతికి, జిల్లా ఎస్పీ రూపేష్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించింది. జిల్లా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రకృతి వనరుల పై విద్యార్థులకు అవగాహన

మనోహరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పర్కిబండ అడవిలో తూప్రాన్ గీత స్కూల్ విద్యార్థులకు ప్రకృతి వనరులపై మనోహరాబాద్ అటవీ రేంజ్ అధికారి అంబర్‌సింగ్ అవగాహన కల్పించారు. అనంతరం అటవీ ప్రాంతంలో విద్యార్థులకు తిప్పి చూపించారు. కార్యక్రమంలో అటవీ అధికారులు కలీంఉద్దిన్, బీట్ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

జహీరాబాద్,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అత్యవసరమని సీనియర్ సివిల్‌జడ్జి, మండల లీగల్‌సర్వీసెస్ చైర్మన్ సూరీక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ వసతిగృహంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అనంతరం వివిధ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు రుద్రయ్యస్వామి, లీగల్‌సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్‌వాలంటీర్లు,విద్యార్థులు తదితరులున్నారు.

గ్రామాల స్థితిగతులపై అవగాహన అవసరం

జహీరాబాద్,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌గ్రామంలో కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానకళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో నెలకొన్న వివిధ రకాల అంశాలకు సంబంధించి భాగస్వామ్య గ్రామీణ అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏఈవో ప్రదీప్, కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ గ్రామంలో భాగస్వామ్య గ్రామీణ అనుభవ కార్యక్రమం ఏర్పాటు చేయడం మూలంగా రైతులకు, ప్రజలకు వారి వారి గ్రామాలపై మరింత అవగాహన ఏర్పడుతుందన్నారు.

'లగచర్ల గిరిజనులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి'

తూప్రాన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోడంగల్ నియోజకవర్గం లగచర్లలో అమాయక గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింమనాయక్ డిమాండ్ చేశారు మండలంలోని నర్సంపల్లికి చెందిన నర్సింహనాయక్ శుక్రవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.

పేదల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు అంబేడ్కర్

అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఆయా పార్టీలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహనీయుడు బాబా సాహెబ్ అని పేర్కొన్నార ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు.

- న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి)




సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు, తూప్రాన్‌లో అంబేద్కర్ వర్ధంతితో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లా కేంద్రంలోని జంబికుంటలో అంబేడ్కర్ చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కోఆప్షన్ మెంబర్ గంగాధర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబు జగ్జీవన్‌రావు యువజన సంఘ సభ్యులు స్థానిక గోల్కొండ వీధిలో అంబేద్కర్‌కు చిత్రపటానికి నివాళులర్పించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు అస్తరుగళ్ల బాలరాజ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం, సంఘం రాష్ట్ర కార్యదర్శి బంధాల సాయిల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పాపన్నపేట మండలం నాగ్సాన్పల్లిలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకుడు దండోళ్ల సామెల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చేగుంటలోని మక్కరాజిపేట్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, దళితసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూప్రాన్ పట్టణంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. వెల్దుర్తిలోని అంబేద్కర్ విగ్రహానికి నర్సాపూర్ నియోజకవర్గ సమన్వయకర్త జూలకంటి ఆంజనేయులు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సాపూర్‌లో దళిత సంఘాల నాయకులతోపాటు సీపీఎం నాయకులు అంబేద్కర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సీపీఎం, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

సంగారెడ్డి జిల్లాలో...

డా.బీ.ఆర్. అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని అంబేద్కర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా పలు సంఘాల నాయకులు సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి, అంబేద్కర్ స్టడీ సర్కిల్, అంబేద్కర్ భవన్‌లో గల విగ్రహాలకు నివాళులర్పించారు. పటాన్‌చెరులో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుడు నీలంమధు, నాయకులతో కలిసి నివాళులర్పించారు. జిన్నారం మండలంలోని జిన్నారం, మాధారం, బొల్లారం తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. వట్‌పల్లి మండలం పోతులబోగుడలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్, హత్నూర, నస్తీపూర్, చింతల్‌చెర్వు, సాదుల్లానగర్, గుండ్లమాచునూర్ గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు దళితసంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుమ్మడిదల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుమ్మడిదల గ్రామంలోని కానుకుంట చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్పొరేటర్లు వి.సింధూ ఆదర్శరెడ్డి, పుష్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్‌ఘనీ, పర్స శ్యాంరావు, కె.భరత్‌కుమార్ తదితరులు అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఉమ్మడి పుల్కల్ మండలంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చక్రియాల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రేషన్ డీలర్ అంబేద్కర్ సంఘం నాయకుడు ఉప్పరి దేవదాస్ అధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోర్పోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నారాయణఖేడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రజనీకాంత్, సాయిరాంతోపాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసినివాళులర్పించారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంతో పాటు మండలంలోని కారముంగి, కరస్‌గుత్తిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.